

RNI NO. TELTEL201876342

# లోకంతీరు

సామాజిక, రాజకీయ దిన పత్రిక

నిజామాబాద్, కామారెడ్డి , నిర్మల్, అదిలాబాద్, వరంగల్ | గురువారం | 05-09-2024 | వెల ; 3.00







## పూజారి కాబోయి రాష్ట్రపతి అయ్యారు..

" గురు బ్రహ్మ, గురు విష్ణు , గురు దేవో మహేశ్వరహ
గురు సాక్షాత్ పరబ్రహ్మ ,తస్మై శ్రీ గురవే నమః "

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పరిచయం అక్కర్లేని పేరు. ఆయనో ఆసాధారణ ప్రజ్ఞాశాలి. రాజ నీతి కోవిదుడు, విద్యావేత్త. భారత తొలి ఉపరాష్ట్రపతిగా, రెండో రాష్ట్రపతిగా పదవులకే వన్నెతెచ్చిన 'భారతరత్నం'. ప్రజాస్వామ్య విలువలను నెలకొల్పడంలో.. విద్యకు సమున్నత స్థానాన్ని కల్పించడంలో ఆయన చూపిన ప్రజ్ఞ, చొరవ ఆయన్ను చరిత్రలో నిలిచిపోయేలా చేసింది. 'తత్వవేత్తలు రాజ్యాధిపతులు అయినప్పుడు ఆదర్శ రాజ్యం ఏర్పడి దేశంలో సుఖశాంతులు విలసిల్లుతాయి' అన్న గ్రీక్ తత్వవేత్త ప్లేటో వ్యాఖ్యలకు నిలువెత్తు నిదర్శనం మన రాధాకృష్ణన్. సెప్టెంబర్ 5 ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆయన జీవితంలోని కొన్న మధుర ఘట్టాలను తెలుసుకునే ప్రయత్నం చేద్దాం..

**చదువంతా స్కాలర్‌షిప్ డబ్బులతోనే!**

సర్వేపల్లి రాధాకృష్ణన్ 1888 సెప్టెంబర్ 5వ తేదీన తమిళనాడులోని తిరుత్తణి గ్రామంలో తెలుగు బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. తల్లిదండ్రులు సర్వేపల్లి వీరాస్వామి, సీతమ్మ దంపతులు. రాధాకృష్ణన్ తొలినాళ్లు తిరుత్తణి, తిరుపతిలోనే గడిచాయి. తండ్రి స్థానిక జమిందార్ వద్ద సబార్డినేట్ రెవెన్యూ అధికారిగా ఉండటంతో రాధాకృష్ణన్ ప్రాథమిక విద్య తిరుత్తణిలోని కేవీ హైస్కూల్లో జరిగింది. 1896లో తిరుపతిలోని హెర్మన్స్‌బర్గ్ ఎవాంజిలికల్ లూథరన్ మిషన్ స్కూలులోనూ, వాలాజీపేటలోని ప్రభుత్వ హైయర్ సెకండరీ స్కూలులోనూ జరిగింది.ఆయన చదువంతా స్కాలర్‌షిప్‌లతోనే జరిగిందంటే ఆయన ప్రతిభ ఏంటో అర్థం చేసుకోవచ్చు. అనంతరం పదహారేళ్ల ప్రాయంలో పెద్దలు కుదిర్చిన తన దూరపు బంధువైన శివకామును రాధాకృష్ణన్ వివాహం చేసుకున్నారు. వీరికి గోపాల్ అనే కుమారుడితో పాటు ఐదుగురు కుమార్తెలు ఉన్నారు.

**పూజారి కాబోయి.. రాష్ట్రపతిగా!**

ఇక్కడొక ఆసక్తికరమైన నేపథ్యం గురించి చెప్పుకోవాలి.. నిజానికి రాధాకృష్ణన్ ఉన్నత చదువులకు వెళ్లడం వారి తండ్రి వీరాస్వామికి ఇష్టముండేది కాదట. బ్రాహ్మణ కుటుంబానికి చెందిన తన కుమారుడు ఏదైనా ఆలయంలో పూజారిగా స్థిరపడాలని తండ్రి కోరుకునేవారట. అయితే.. కుమారుడి అద్భుత ప్రజ్ఞ చూసి చదివించాలని నిర్ణయించుకున్నారు. తర్వాత మనందరికీ తెలిసిందే.. విద్యావేత్తగా, తత్వవేత్తగా విజయవంతమైన ప్రయాణాన్ని సాగించి.. చరిత్ర పుటల్లో నిలిచారు. ఆరోజు రాధాకృష్ణన్ తండ్రి మనసు మారకుంటే మనం గొప్ప విద్యావేత్త, తత్వవేత్త అయిన ఈ మహెూన్నతమైన వ్యక్తిని భారత రాష్ట్రపతిగా చూసి ఉండేవారం కాదేమో!

## ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు

## మిలాద్-ఉన్-నబీ వేడుకలు





- శాంతి కమిటీ సమావేశంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- అవాంఛనీయ ఘటనలు తావులేకుండా గట్టి బందోబస్తు : సీ.పీ కల్మేశ్వర్
- మంటపాల వద్ద సీ.సీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులకు హితవు

**నిజామాబాద్, సెప్టెంబర్ 04 ( లోకంతీరు ) :** ప్రశాంత వాతావరణంలో వినాయక చతుర్థి, మిలాద్-ఉన్-నబీ వేడుకలు ఘనంగా జరుపుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పిలుపునిచ్చారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో బుధవారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం కలెక్టర్, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం జరిపి కీలక సూచనలు చేశారు. మిలాద్-ఉన్-నబీ, గణేష్ ఉత్సవాల సందర్భంగా చేపట్టాల్సిన చర్యలు, అందుబాటులోకి తేవాల్సిన సదుపాయాల గురించి సార్వజనిక్ గణేష్ మండలి ప్రతినిధులు, శాంతి కమిటీ సభ్యులు, ముస్లిం మత పెద్దలు, మండపాల నిర్వాహకులు పలు ప్రతిపాదనలు చేస్తూ తమ అభిప్రాయాలను వెల్లడించారు. శాంతియుత వాతావరణంలో, భక్తి శ్రద్ధలతో మతసామరస్యానికి ప్రతీకగా వేడుకలు జరిగేలా తోడ్పాటును అందిస్తామని అన్నారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ, ఉత్సవాల నిర్వహణకు జిల్లా యంత్రాంగం తరపున పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందిస్తామని, రోడ్ల మరమ్మతులు, శోభాయాత్రకు అడ్డంకిగా ఉండే చెట్ల కొమ్మలను తొలగించడం వంటి పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఎంతో సహృద్భావ వాతావరణంలో ఈ వేడుకలు జరుగుతాయని, ఈసారి కూడా అదే స్ఫూర్తిని ప్రదర్శిస్తూ గణేష్ ఉత్సవాలు జరుపుకోవాలని, జిల్లాను ఆదర్శంగా నిలపాలని కోరారు. గతేడాది తరహాలోనే ఈసారి కూడా వినాయక నిమజ్జనం, మిలాద్-ఉన్-నబీ వేడుక ఒకేసారి వస్తున్నందున భద్రతాపరమైన చర్యలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడ కూడా అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏకధాటిగా వర్షాలు కురుస్తున్నందున మండపాల ఏర్పాటులో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎవరకు కూడా విద్యుదాఘాతం బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. మండపాలకు ప్రభుత్వం తరపున ఉచితంగా విద్యుత్ సరఫరా చేయనున్నందున, మంటపాల వివరాలను ట్రాన్స్ కో అధికారులకు తెలియజేసి, ఆ శాఖ సిబ్బంది ద్వారానే విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేసుకోవాలని హితవు పలికారు. షార్ట్ సర్క్యూట్ వంటి వాటిని నిరోధించే ఉపకరణాలను అమర్చుకోవాలని హితవు పలికారు. ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడకుండా, ప్రజలకు అసౌకర్యం కలుగకుండా వినాయక మంటపాలు ప్రతిష్ఠించాలని సూచించారు. భారీ శబ్దాల వల్ల చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉన్నందున మంటపాల వద్ద శబ్ద కాలుష్యం కలిగేలా డీ.జే సౌండ్లతో హెూరెత్తించకుండా భక్తి పాటలు, భజనలతో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసేలా నిర్వాహకులు కృషి చేయాలన్నారు. వినాయక నిమజ్జనోత్సవం సందర్భంగా ప్రమాదాలు జరుగకుండా ఉండేందుకు విగ్రహాలు నిమజ్జనం చేసే ప్రక్రియను ఆద్యంతం అధికారులు పర్యవేక్షణ జరపాలని, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుతూ క్రేన్, లైటింగ్ వ్యవస్థ, అత్యవసర వైద్యం, తాగునీరు, బారికేడింగ్, ట్రాఫిక్ క్రమబద్దీకరణ, పారిశుధ్యం వంటి చర్యలు ప్రణాళికాబద్దంగా చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. విగ్రహాల ఊరేగింపు సమయంలో శోభాయాత్రలో పాల్గొనే వాహనాల్లో ఎటువంటి యాంత్రిక సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని, నిమజ్జన యాత్ర కొనసాగే ప్రాంతాలలో రోడ్లకు ఇరువైపులా కిందికి వేలాడే కరెంటు తీగలు, వంగి ఉన్న చెట్ల కొమ్మలు వంటివి ఏవైనా అడ్డంకులు ఉంటే వాటిని తొలగించాలని, ప్యాచ్ వర్క్ చేపట్టి రోడ్లపై ఏర్పడిన గుంతలను మూసివేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. చెరువులు, గోదావరి పరీవాహక ప్రాంతాల వద్ద సరిపడా సంఖ్యలో క్రేన్ లను ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గణేష్ ఉత్సవాలు, జెండా బాలాజీ వేడుకల సందర్భంగా నిర్ణీత రోజుల్లో మద్యం విక్రయాలు జరుగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అధికారులకు సూచించారు. ప్రజలు ఎలాంటి అపోహలు, వదంతులను నమ్మకూడదని, ఎక్కడైనా ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే పోలీసుల దృష్టికి తేవాలని, ప్రతి ఒక్కరు సంయమనం పాటిస్తూ పరస్పరం సహకరించుకుంటూ ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. కాగా, సమస్యాత్మక ప్రాంతాలు, ప్రార్థనాలయాల వద్ద సి.సి కెమెరాలతో నిఘా ఏర్పాటు చేస్తామని, ఒక్క నిజామాబాద్ నగరంలోనే ఈసారి సుమారు 750 పైచిలుకు సీ.సీ కెమెరాలు నెలకొల్పుతున్నామని పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ తెలిపారు. అయితే నిర్వాహకులు కూడా గణేష్ మండపాల వద్ద ఎవరివారు కనీసం ఒకటైన సీ.సీ కెమెరాను ఏర్పాటు చేసుకోవడం వల్ల ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా ఉంటుందన్నారు. మంటపాల వద్ద నిర్వాహకులు రాత్రి వేళల్లో తప్పనిసరిగా ఉండాలని అన్నారు. సామాజిక మాధ్యమాలలో చేసే పోస్టింగ్ లపై ప్రత్యేక నిఘా ఉంచుతామని, ప్రశాంతతకు భంగం కలిగిస్తూ అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. సహృద్భావ వాతావరణంలో పరస్పర సహకారంతో శోభాయమానంగా ఉత్సవాలను నిర్వహించుకోవాలని, వేడుకలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని, ప్రతి మండపం వద్ద పోలీసులను నియమిస్తామని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.మకరంద్, ట్రైనీ కలెక్టర్ సంకేత్ కుమార్, డిప్యూటీ మేయర్ ఇద్రీస్, అదనపు డీసీపీలు కోటేశ్వర్ రావు, బస్వారెడ్డి, ఆర్డీఓలు అంబదాస్ రాజేశ్వర్, రాజాగౌడ్, నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకటరెడ్డి, వివిధ శాఖల అధికారులు, శాంతి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లోకంతీరు

RNI NO. TELTEL2018 76342

నిజామాబాద్, కామారెడ్డి , నిర్మల్, అదిలాబాద్, వరంగల్ | గురువారం | 05-09-2024 | వెల ; 3.00

# లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ చెక్కులు పంపిణీ

## -అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ






**నిజామాబాద్ ,సెప్టెంబర్ 04 (లోకంతీరు) :** నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం పరిధిలోని అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందిన పలువురు పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజురైన ఆర్థిక సహాయాన్ని(చెక్కులు) లిఅర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 61 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం ధన్ పాల్ మాట్లాడుతు తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత తన కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్న వారిలో 61 మందికి, రూ.17,72,000 రూపాయలు విడతగా చెక్కులు వచ్చాయన్నారు. ఎలాంటి పైరవీలు లేకుండా దరఖాస్తు చేసుకునే వారు నేరుగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అన్ని పత్రాలు అందజేస్తే సాధ్యమైనంత వరకు ప్రభుత్వం నుంచి, ముఖ్య మంత్రి సహాయ నిధి సాయం అందేలా తన వంతు ప్రయత్నం చేస్తానన్నారు. వేలాది మంది పేద, మధ్య తరగతి ప్రజలకు యేటా సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక చేయూతనందించడం జరుగుతుందని తెలిపారు, నియోజకవర్గంలో వందలాది మంది పేదలకు వైద్య సేవల కోసం సీఎం సహాయనిధి ద్వారా చెక్కులు అందించినట్లు చెప్పారు.లబ్దిదారులకు భారం కాకుండా చెక్కుల జారీ విషయంలో జాప్యం జరగకుండా అప్లై చేసుకున్న నెలలోపు వచ్చేల ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అలాగే లబ్దిదారులకు అప్లై చేసుకున్న మొత్తంలో 50% విడుదల చేయాలనీ డిమాండ్ చేసారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు నాయకులు తదితరులు పాల్గొన్నారు.


# వైద్యం వ్యాపారంగా మార్చిన వైనం..?

**కామారెడ్డి ప్రతినిధి , సెప్టెంబర్ 4**




- పీల్చుకు తింటున్న కొందరు వైద్యులు.. ?
- లైసెన్స్ లేని ల్యాబ్ లు.. ?
- లేని రోగాలను అంటగట్టడం.. ?
- ఆసుపత్రి పై చర్యలు ఎక్కడ..?
- సామాన్య ప్రజలు భయాందోళనలకు గురి
- జిల్లా వైద్యాధికారి స్పందిస్తారా.. ?






వైద్య వృత్తిలో ఉండి ప్రజల ప్రాణాలను కాపాడవలసిన ఒక వైద్యాధికారి వ్యాపారంగా మర్చిన సంఘటన కామారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగింది.ఈ సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలతో ఫిర్యాదు చేశారు. దీనిపై ఇంతవరకు చర్యలు తీసుకోలేదని బుధవారం బాధితులతో కలిసి జిల్లా వైద్యాధికారిని కలిసిన సదాశివ నగర్ మండల మాజీ జెడ్పిటిసి పడిగెల రాజేశ్వరరావు, రామారెడ్డి మాజీ ఎంపీపీ దశరథ్ రెడ్డి, తిరుమనపల్లి మాజీ సర్పంచ్ మధుసూదన్ రావుతో కలిశారు. ఈ విషయంపై అధికారికంగా త్వరలో చర్య తీసుకుంటాను అని అన్నారు. తిరుమనపల్లి గ్రామానికి చెందిన ఆరె సంజ్య ఈనెల 29న జ్వరం రావడంతో కామారెడ్డి లోని లక్ష్మీ నరసింహ ఆసుపత్రికి చికిత్స కోసం తీసుకువెళ్లగా .దీంతో వైద్యుడు సంతోష్ రక్త పరీక్ష చేయాలని ల్యాబ్ టెస్ట్ కు పంపారు. సదరు ల్యాబ్ యజమాని డెంగ్యూ వచ్చిందని రిపోర్టు ఇచ్చారు. దీంతో సంతోష్ డాక్టర్ బాధితురాలు తండ్రిని పిలిచి డెంగ్యూ రిపోర్ట్ వచ్చిందని శిశురక్ష లో 30 వేల రూపాయల అడ్వాన్స్ కట్టాలని వైద్యుడు సూచించారు.బాధితురాలు తండ్రి వీరి మాటలపై అనుమానం వచ్చి వైద్య వృత్తిలో పనిచేస్తున్న తన బంధువుకు ఫోన్ చేశారు. దీంతో ఇంత తొందరగా డెంగ్యూ రిపోర్టు రాదని మీరు భయపడవలసిన అవసరం లేదని తనకు తెలిసిన మరో ల్యాబ్ లో పరీక్ష చేయించుకోవాలని సూచించారు. బాధితురాలు తండ్రి వేరే ల్యాబ్ కు వెళ్లి పరీక్ష చేయించగా డెంగ్యూ లేదని నిర్ధారణ అయింది. దీన్ని బట్టి చూస్తే కామారెడ్డిలో వైద్యం వ్యాపారంగా మార్చి ప్రజలను దోసుకు తింటున్నారని వైద్యం వ్యాపారంగా మారిందన్నారు.వెంటనే సంబంధిత వైద్యులపై ల్యాబ్ యాజమానిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఆ ల్యాబ్ కామారెడ్డి లో లేదని సాధారణ ప్రజల ను భయభ్రాంతులకు గురి చేసే వైద్యులు ఇటు ల్యాబ్ యజమాని డబ్బులు సంపాదిస్తున్నారని పలువురు ఆరోపించారు .దీనిపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. వైద్యాధికారి చంద్రశేఖర్ ను సంప్రదించగా హాస్పిటల్, ల్యాబ్ కు నోటీసులు ఇవ్వడం జరిగింది అని అన్నారు. జిల్లా వైద్యాధికారి త్వరలోనే చర్యలు తీసుకుంటామని చెప్పడం జరిగింది.




# వైన్స్ లో దొంగతనం

**బాల్కొండ నియోజకవర్గం ప్రతినిధి, సెప్టెంబర్ 04**





బాల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని కిసాన్ నగర్ గ్రామంలోని పాత జాతీయ రహదారి -7 పై ఉన్న తుల్జభవాని వైన్స్ లో మంగళవారం అర్ధరాత్రి తర్వాత గుర్తుతెలియని దుండగులు చొరబడి దొంగతనం చేశారు.కౌంటర్ లో ఉన్న 14 వేల రూపాయలు ఎత్తుకెళ్లారు. ఉదయం వైన్స్ షటర్లు తెరిచి ఉండడంతో గమనించిన స్థానికులు యజమానికి తెలపడంతో, దొంగతనం జరిగిన విషయాన్ని బుధవారం ఉదయం బాల్కొండ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఏఎస్సై రాజేశ్వర్ రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం సిబ్బంది వేలిముద్రలను సేకరించారు. యజమాని ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

# పంట నష్టం వివరాల సేకరించిన అధికారులు



**కామారెడ్డి జిల్లా / బిక్కనూర్ ,సెప్టెంబర్ 04 ( లోకంతీరు ) :** జిల్లాలోని బిక్కనూరు మండలం కాచాపూర్ గ్రామంలో అకాల వర్షాల వలన జరిగిన పంట నష్టం వివరాలను సేకరిస్తున్నామని మండల వ్యవసాయ అధికారిని రాధ రెడ్డి తెలిపారు. కాచాపూర్ గ్రామంలో ఆమె బుధవారం పర్యటించారు. అకాల వర్షం వల్ల నష్టం జరిగిన వరి, మొక్కజొన్న పంటను ఈదుల కుంటల 15 ఎకరాలు ప్యాడి, భవాని చెరువులో 20 ఎకరాలు వరి మునిగింది. మునిగిన పంట పొలాలను ఆమె పరిశీలించారు. రైతులు పంట నష్టం వివరాలు వ్యవసాయ సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. ఏవో రాధ రెడ్డి, ఏ ఈ ఓ ప్రియాంక, రైతులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు భోజన వసతి



**రామారెడ్డి ,సెప్టెంబర్ 04 ( లోకంతీరు ) :** అకాల వర్షాల కారణంగా నిరాశ్రయులైన కుటుంబాలను ఈ యొక్క విపత్కాల సమయంలో ఆదుకోవాలని సదుద్దేశంతో స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆదేశాల మేరకు రామారెడ్డి మండల కేంద్రం లో అకాల వర్షాలకు పునరావాస కేంద్రంలో ఉన్న బాధితులకు రామారెడ్డి కస్తూర్బా హాస్టల్ ప్రిన్సిపాల్ తో మాట్లాడి భోజనం వసతి ఏర్పాటు చేయడం జరిగింది. అలాగే కలరా, మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ, రాకుండా ముందు జాగ్రత్త చర్యలుగా మందులను వైద్యాధికారి డాక్టర్ సురేష్ అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు లక్ష్మా గౌడ్,రావుఫ్, టౌన్ సీనియర్ ఉపాధ్యక్షుడు నామాల రవి, సెక్రెటరీ గణేష్,బండి ప్రవీణ్, గోపి,యూత్ నాయకులు అద్నన్,హర్షిత్ గౌడ్, లింబాద్రి, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, పాల్గొనడం జరిగింది.

# లోకంతీరు

RNI NO. TEL/TEL/2018/76342

నిజామాబాద్, కామారెడ్డి , నిర్మల్, అదిలాబాద్, వరంగల్ గురువారం 05-09-2024 వెల : 3.00


## ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక



రామారెడ్డి, సెప్టెంబర్ 04 ( లోకంతీరు ) : రామారెడ్డి మండలం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రెడ్డిపేట్ తండా లో ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న ఉపాద్యాయుడు విట్టబోయిన అనిల్ కుమార్ జిల్లా స్థాయి లో ఉత్తమ ఉపాధ్యాయుని గా ఎంపికైనట్టు కామారెడ్డి జిల్లా విద్యాధికారి రాజు ఉత్తర్వులు జారీ చేసినట్టు తెలిపారు. వీరికి సెప్టెంబర్ 5 ఉపాధ్యాయ దినోత్సవం రోజున కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ చేతుల మీదుగా సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో గల మీటింగ్ హాల్ లో సన్మానించడం జరుగుతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్ ఒక ప్రకటన లో తెలిపారు.

## అయ్యప్ప దేవాలయంలో
## ప్రతి బుధవారం పేద ప్రజలకు అన్నదానం



కామారెడ్డి జిల్లా ,సెప్టెంబర్ 04 ( లోకంతీరు ) : కామారెడ్డి పట్టణంలో అయ్యప్ప దేవాలయంలో ప్రతి బుధవారం నిర్వహించే పేదవారికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు గందే శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గోనె శ్రీనివాస్, ఉపాధ్యక్షులు పంపరి లక్ష్మణ్, అయ్యప్ప అన్న సేవా సమితి కార్యదర్శి భార్గవ్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కూర శ్రీనివాస్, సహాయ కార్యదర్శి గంజి సతీష్, వీరమల్లి శ్రీనివాస్, పబ్బ వేణు, చీల సూర్య ప్రకాష్, నక్క శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

## నిరాశ్రయులైన కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత


కామారెడ్డి ప్రతినిధి,సెప్టెంబర్ 04 ( లోకంతీరు ) : రామారెడ్డి మండల కేంద్రంలోని అన్నారం గ్రామంలో గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు కీసరి రాజేశం ఇల్లు కూలిపోయిందన్న



విషయం తెలుసుకున్న మండల కామారెడ్డి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మద్దికుంట నర్సాగౌడ్, మైనారిటీ సెల్ జిల్లా నాయకులు ఎండీ సల్మాన్, బాధిత కుటుంబాల ఇళ్లను పరిశీలించి వారిని పరామర్శించి వారిని ప్రభుత్వ పాఠశాలలో తాత్కాలికంగా ఆశ్రయం కల్పించి వారికి బియ్యం కొంత నగదును అందజేశారు.ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సూచనలతో సాయం అందజేస్తు వారికి ప్రభుత్వం తరుపున ఆదుకుంటామని తెలిపారు.అలాగే గ్రామం లోని ఉమామహేశ్వర స్వామి ఆలయానికి మైక్ సెట్ కూడా ఇప్పించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గంగారెడ్డి, దయానంద్,.చాకలి బాలయ్య, బలరాం నమీలే రాజు, చాకలి శ్రీను, కుమ్మరి బాలరాజ్. డీలర్ గోపాల్,కీసరి లింగం తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య పనులను
## తనిఖీ చేసిన జిల్లా అధికారులు

కామారెడ్డి జిల్లా/రాజంపేట,సెప్టెంబర్ 04 ( లోకంతీరు ) : జిల్లాలోని రాజంపేట మండల



కేంద్రంలో జిల్లా అధికారులు డి ఎల్ పి ఓ శ్రీనివాస్, డిపిఓ శ్రీనివాసులు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు రోగాల భారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ రఘురాం, పంచాయతీ కార్యదర్శి అశోక్, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## వర్షాల్లో నష్టపోయిన వాటిని
## ఎమ్మెల్యే దృష్టికి తీసుక వెళ్లిన నాయకులు





కామారెడ్డి జిల్లా / రాజంపేట, సెప్టెంబర్ 04 ( లోకంతీరు ) : ఎల్లారెడ్డి నియోజక వర్గంలో రాజంపేట మండలంలో పలు గ్రామాలలో వర్షాల కారణంగా నష్టపోయిన వాటిని కాంగ్రెస్ పార్టీ నాయకులు గుర్తించారు. తాండలకు వెళ్ళే రోడ్డు మార్గాలలో బ్రిడ్జిలు కుంగిపోవడం జరిగింది. ప్రతి గ్రామంలో పాఠశాల భవనాలను సందర్శించారు. .ప్రతి గ్రామంలో పాఠశాలలో పిల్లలకు కావాల్సిన మౌళిక వసతులు లేక ఇబ్బంది పడుతున్నారని, విద్యార్థుల తల్లి దండ్రులు పాఠశాల యాజమాన్యం మా దృష్టికి తీసుకవచ్చారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ దృష్టికి తీసుకెళ్లి వాటికి వెంటనే పరిష్కారం అయ్యే విదంగా చూస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్ర ప్రణీత్ రెడ్డి, ఉపాధ్యక్షులు భీమరి శ్యామయ్య, మాశెట్టి శ్రీధర్, బన్సీలాల్, ఎస్ టి సెల్ అధ్యక్షులు దేవీసింగ్, డివిజన్ అధ్యక్షులు మదన్ లాల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాయగౌడ్, మండల యూత్ ఉపాధ్యక్షులు బాలరాజ్, వివిధ గ్రామల అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, గణేష్ నాయక్, నరేందర్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ ను కలిసిన నూతన జైల్ సూపరిండెంట్



కామారెడ్డి జిల్లా ,సెప్టెంబర్ 04 ( లోకంతీరు ) : కామారెడ్డి సబ్ జైల్ లో నూతనంగా సూపరింటిండెంట్ గా విధులు నిర్వహిస్తున్న సిహెచ్. సంజీవరెడ్డి బుధవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ ను మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకేను అందజేశారు.

## బీబీపేట మండల రైతులు
## తహసిల్దార్ కి వినతి పత్రం అందజేత

కామారెడ్డి జిల్లా / బీబీపేట,సెప్టెంబర్ 04 ( లోకంతీరు ) : జిల్లాలోని బీబీపేట మండల



కేంద్రంలో గల అయ్యప్ప వెంచర్ నిర్వహకులు కొచ్చేరువులోకి వెళ్లే నీటి కాలువను పూర్తిగా తొలగించి వెంచర్ను విస్తరించారు. సమీపంలో చిన్న డ్రైనేజ్ అకారణంగా నిర్మించారు. ఆ యొక్క కాలువ నుండి గత మొన్నటి వరకు కురిసిన భారీ వర్షాలకు చెరువులోకి చుక్క నీరు రాలేదు. అధికారులు తక్షణమే పాత నీటి కాలువను పునరుద్దరించాలని తహసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సమస్యపై అధికారులు దృష్టి సారించి కొచ్చేరువు కాలువను గతంలో ఎలా ఉండేదో ఆ విధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు కోరారు. లేనిచో ఆ ప్రాంత రైతోలతో కలిసి ఆందోళన చేపడుతామని రైతులు స్పష్టం చేసారు.

లోకంతీరు

RNI NO. TEL/TEL/2018/76342

నిజామాబాద్, కామారెడ్డి , నిర్మల్, అదిలాబాద్, వరంగల్ | గురువారం | 05-09-2024 | వెల ; 3.00

# మానసిక ఒత్తిడిని అధిగమిస్తేనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు



- మానసిక వైద్యుడు డా.రమణ

కామారెడ్డి జిల్లా / తాడ్వాయి, సెప్టెంబర్ 04 ( లోకంతీరు ) : విద్యార్థులు క్షణికావేశాలకు లోను కాకూడదని, మత్తు పదార్థాల జోలికి వెళ్లకూడదని మొబైల్ ఫోన్లకు బానిస కాకూడదని, మానసిక వైద్య నిపుణులు డాక్టర్ రమణ సూచించారు. బుధవారం తాడ్వాయి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన మానసిక ఆరోగ్య అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.మానసికంగా బాగుంటేనే శారీరకంగా ఆరోగ్యంగా వుండవచ్చని, ఎటువంటి వ్యాధినైన జయించవచ్చన్నారు. అలాగే విద్యార్థులు పరీక్షల్లో ఫెయిల్ అయ్యామని, తక్కువ మార్కులు వచ్చాయని సమాజంలో అవహేళనకు గురవుతున్నామని, క్షణికావేశాలకు లోనయ్యి ఆత్మహత్యలు చేసుకోవద్దని సూచించారు.



అంతేకాకుండా ఈ వయసులో మత్తుపదార్థాల జోలికి అస్సలు వెళ్లకూడదని, మొబైల్ ఫోన్ వినియోగం చేయకూడదని అవసరమైనంత మేరకు మాత్రమే కమ్యునికేషన్ లో భాగంగానే మొబైల్ వాడకం జరపాలని అన్నారు. కానీ వాటికి బానిస కావద్దని సూచించారు. చెడు ఆలోచనలను పక్కకు పెడుతూ చదువుపై దృష్టి పెట్టి లక్ష్యానికి చేరువ కావాలని అప్పుడే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. సోషల్ వర్కర్ డా.రాహుల్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రతి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మానసిక అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు కౌన్సిలింగ్, మానసిక ఒత్తిడిని జయించే మార్గాలు, పరీక్షల సమయాల్లో విద్యార్థుల ప్రిపరేషన్ ప్రణాళికలపై కూలంకుషంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సయ్యద్ యూసఫ్ హుస్సేన్,

# మండల కేంద్రంలో సాంస్కృతిక కళాజాత అవగాహన సదస్సు




కామారెడ్డి జిల్లా ,సెప్టెంబర్ 04 ( లోకంతీరు ) : జిల్లాలోని రాజంపేట మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆదేశాల మేరకు, డిపిఆర్ఓ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అదేవిధంగా 6 గ్యారంటీలు ప్రభుత్వ పథకాలపై, రైతు రుణమాఫీ, గృహజ్యోతి, వివిధ పథకాలపై ప్రజలకు పాటల, మాటల ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సారథి కళాకారులు రమేష్ రావు, మహేందర్, ఐండ్ల రాము, విట్టల్ రెడ్డి, నాగరాజు, దివ్య, ప్రశాంత్ రెడ్డి, గ్రామ ప్రజలు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.అధ్యాపకులు సంతోష్, వీరేశం, మల్లేశం, సతీష్చంద్ర, సరస్వతీ, శ్రీకాంత్, సతీష్, హరిక సిబ్బంది నర్సయ్య, సొటీరియా, లక్ష్మి పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలు ప్రశంతంగా జరుపుకోవాలి

- హాజరైన కామారెడ్డి డిఎస్పీ, భిక్నూర్ సి.ఐ.






కామారెడ్డి జిల్లా/రాజంపేట,సెప్టెంబర్ 04 ( లోకంతీరు ) : జిల్లాలోని రాజంపేట మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో బుధవారం స్థానిక ఎస్సై పుష్ప రాజ్ శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కామారెడ్డి డిఎస్పీ నాగేశ్వర్ రావు, భిక్కనూర్ సిఐ సంపత్ కుమార్ శాంతి భద్రత విషయంలో గణేష్ ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలని యువజన సంఘు సభ్యులకు, వినాయక మండపాల నిర్వాహకులకు తెలియజేసారు. భిక్కనూర్ సీఐ సంపత్ కుమార్ మాట్లాడుతూ యువజన సంఘం సభ్యులు ప్రతి ఒక్కరు సామరస్యంగా నిమజ్జనం చేయాలని కోరారు. కామారెడ్డి డి ఎస్ పి నాగేశ్వర్ రావు మాట్లాడుతూ పోలీసు సిబ్బందికి సహకరించి ఎటువంటి శాంతి భద్రతలకు భంగం వాటిల్లకుండా ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలని డి ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పోలీసు సిబ్బంది, తహసిల్దార్ అనిల్ కుమార్, విద్యుత్ శాఖ ఏ ఈ మారుతి, ఎంపిడిఓ రాజేశం, గ్రామ పెద్దలు, గణేష్ మండపాల నిర్వహకులు, యువజన సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం

- ఊపిరి ఉన్నంత వరకు సిద్దిపేట అభివృద్ధి కోసం కృషి చేస్తానన్న మాజీ మంత్రి
- సిద్దిపేట అభ్రివద్ధిని ఓర్వలేక అడ్డుకునే ప్రయత్నం చేస్తోందని ధ్వజం
- ప్రతిపక్షాలపై కాంగ్రెస్ దాడులు, కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆగ్రహం



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వద్ద వ్యంగ్యం తప్ప పరిపాలన లేదని విమర్శించారు.సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తన ఊపిరి ఉన్నంత వరకు సిద్దిపేట అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. తన నియోజకవర్గం అభివృద్ధిని ఓర్వలేక అధికార పార్టీ అడ్డుకునే ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. పోరాడి అభివృద్ధి చేస్తానన్నారు.ప్రతిపక్షాలపై కాంగ్రెస్ దాడులు, కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని విమర్శించారు. అరచేతిలో వైకుంఠం చూపించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రాష్ట్రాన్ని నాశనం చేస్తోందన్నారు.ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో తమ ఎమ్మెల్యేలు ఆదుకోవడానికి వరద ప్రభావిత ప్రాంతాలకు వెళితే కాంగ్రెస్ పార్టీ దాడులకు పాల్పడిందని మండిపడ్డారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారన్నారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల కాలంలో అభివృద్ధి కోసం ఒక్క రూపాయి ఖర్చు చేయలేదని ధ్వజమెత్తారు. కేసీఆర్ ఆశీర్వాదంతోనే రాష్ట్రంలోనే సిద్దిపేటను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దామన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలన కాలంలో సిద్దిపేటకు ఎన్నో తెచ్చుకున్నామన్నారు. సిద్దిపేటలో సగం నిర్మాణం పూర్తయిన వెటర్నరీ కాలేజీని రేవంత్ రెడ్డి కొడంగల్ తరలించుకుపోయారని ఆరోపించారు.



# ప్రమాదకరమైన విద్యుత్ వైర్లు పట్టించుకునే నాథుడే కరువు

బాల్కొండ నియోజకవర్గం ప్రతినిధి , సెప్టెంబర్ 04 ( లోకంతీరు ) : బాల్కొండ మండల కేంద్రంలో అత్తర్ గల్లీలో విద్యుత్ స్తంభానికి మీటర్లకు బిగించిన వైర్లు క్రింద వేలాడుతున్నాయి చిన్నపిల్లలు పెద్దలు వాటిని ముట్టుకుంటే ప్రమాదం జరిగే అవకాశం ఉంది విద్యుత్ వైర్లను సరి చేసే నాథుడే కరువయ్యాడు ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ వైర్లను సరి చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

లోకంతీరు

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు
మండలాల వారిగా
మా సంస్థలో పని చేయుటకు
రిపోర్టర్లు కావలెను

Contact : 9440267861,9346893368



Edited ,Printed, Published & Downloaded at S.S Printers & File Makers , Pusalagally, Jawahar Road, Town & Dist. Nizamabad -503001 : Telangana State
www.lokamteeru.com RNI No. TEL/TEL/22018/76342 Editor : Byagal Srinivas Office Address : Chandra Shekar Colony , Nizambadad -